అంగరంగ వైభవంగా బోనాలు

ఆషాఢమాసంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆయా గ్రామ దేవతలకు భక్తులు బోనాల పండుగను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో మంగళవాయిధ్యాల మధ్య శివసత్తుల పునకాలు, బోతురాజుల నృత్యాలతో బోనాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించి, అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం గ్రామ దేవతలకు ఒడి బియ్యం పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్ రూరల్: బండ్ల ఊరేగింపు



పెద్దశంకరంపేటలో భవానీమాతకు బోనాలు



రామాయంపేటలో..



కౌడిపల్లిలో బోనాలతో భక్తులు



కొల్చారంలో ..



మెదక్ మున్సిపాలిటీ: బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మైనంపల్లి వాణి



చిన్నశంకరంపేట(మెదక్): శేరిపల్లిలో బోనాలతో మహిళలు



టేక్మాల్‌లో..



శివ్వంపేట(నర్సాపూర్): బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే. రాజిరెడ్డి



శివ్వంపేటలో బోనాల ఊరేగింపు

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హరిబాబు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ హరిబాబు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస రాజశేఖర్, రేఖలక్ష్మి, మల్లయ్య, నాగమణి, సంతోషలు బదిలీపై వెళ్లగా సన్మానించారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమని తెలిపారు. ఈకార్యక్రమంలో పీడీ రాజన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారికి జడ్జి పూజలు



నర్సాపూర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మ వారికి పూజలు చేస్తున్న జడ్జి

నర్సాపూర్: పట్టణంలో ఆదివారం జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మొక్కులు చెల్లించుకున్నానని తెలిపారు.

సేవా కార్యక్రమాలు చేయాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: సేవా కార్యక్రమాలు చేసేందుకు ఉపాధ్యాయులు ముందు ఉండాలని ఎంఈఓ బుచ్చానాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ సభ్యులు ప్రమోషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, ఇతర నాయకులు స్వరూపరాణి, జిల్లా కార్యదర్శి వీరేశం, ప్రసన్న కుమార్ లాలు, సత్యనారాయణ, జైత్య, రమేశ్, లక్ష్మీనారాయణ, సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న రైతులు

నర్సాపూర్: కొండ పోచమ్మ కాల్వ వద్దు - సెమి అర్బన్ ముద్దు నినాదంతో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 17వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షల్లో చిన్నచింతకుంట, చెన్నాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నిశాంత్ రెడ్డి, ప్రభాకర్, దత్తాత్రేయ, రాజమౌళి, నగేష్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, హన్మంతుగౌడ్, ప్రేంచరన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని అటవీ రేంజీ పరిధిలోని కోమటిపల్లి ప్లాంటేషన్‌లో ఆదివారం ఆ శాఖ అధికారులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని అటవీశాఖ రేంజీ అధికారి విద్యాసాగర్ సూచించారు. కార్యక్రమంలో రేంజీ అధికారితో పాటు డిప్యూటీ రేంజీ అధికారి ఖుద్బొద్దీన్, సెక్షన్ అధికారి బలరాం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాముండేశ్వరికి పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకుడు తెలిపారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

రోడ్డు నిర్మించాలని గిరిజనుల ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న కొచ్చెరుతండావాసులు

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు నిర్మించాలని తండావాసుల ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని కొచ్చెరువు తండాకు వెళ్లే 3 కిలోమీటర్ల రోడ్డు బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు ఆదివారం రామాయంపేట-మెదక్ రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆచరణకు హామీలిచ్చే రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో ఉన్న పాలకులకు కూడా పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమ తండాలు గుర్తుకు వస్తాయే తప్ప తమ బాధలు పట్టించుకునేవారు లేరన్నారు. తమ తండాకు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కనీసం 108 అంబులెన్స్ కూడా రాకపోవడం కారణంగా ఓ వ్యక్తి అస్వస్థతకు గురైతే బైక్‌పై తీసుకెళ్లాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న హవేళిఘణాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తండావాసుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీనివ్వడంతో ధర్నాను విరమింపజేశారు. కొచ్చెరు తండావాసులున్నారు.

భూపోరాట కమిటీ ఏర్పాటు



భూ పోరాట కమిటీ సభ్యులు

చేగుంట(తూప్రాన్): కాస్తులో ఉండి భూమిని సాగు చేసుకుంటున్న వారికే పట్టాల కోసం చిట్టోజిపల్లిలో భూ పోరాట కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. పోరాట కమిటీ కన్వీనర్‌గా మల్లేశం, కోకన్వీనర్‌లుగా శ్రీను, పరశురాములు, ఎల్లం, సభ్యులుగా రాజునర్సింలు, మల్లయ్య, భూషణం, స్వామి, శ్రీను, సత్తయ్యలను ఎన్నుకున్నారు. గ్రామంలో 192 రైతులు సీలింగ్ చట్టం ప్రకారం 266/1భూమిని సాగు చేసుకుంటున్నారని వారందరికి పట్టాలు వచ్చేలా చేసేందుకు పోరాట కమిటీ పని చేస్తుందని మలేశం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **తాగునీటిలో వచ్చిన చేపపిల్ల**

నర్సాపూర్: తాగునీటిలో చిన్న చేపపిల్ల వచ్చిందని పట్టణంలోని సునీతారెడ్డి కాలనీకి చెందిన షఫీ తెలిపారు. ఆదివారం రోజు మాదిరిగా మిషన్ భగీరథ నల్లా ద్వారా నీళ్ల పట్టుకుంటుండగా నీటితో పాటు చిన్న చేపపిల్ల వచ్చిందని ఆయన చెప్పారు. నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకొని నాణ్యమైన నీటి సరఫరా చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **ఎంకంపల్లి బ్రిడ్జి నుంచి రోడ్డు నిర్మించాలి**

పాపన్నపేట(మెదక్): ఎంకపల్లి బ్రిడ్జి నుంచి పాపన్నపేట వరకు రోడ్డు నిర్మించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి విజ్ఞప్తి చేశానని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఎంకంపల్లి బ్రిడ్జి నిరుపయోగంగా మారిందన్నారు. కామారెడ్డి జిల్లాలో తాండూరు నుంచి ఎంకంపల్లి వరకు రోడ్డు వేసి బ్రిడ్జి నిర్మించినప్పటికి, అక్కడి నుంచి పాపన్నపేట వరకు రోడ్డు వేయలేదని ఆరోపించారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా.. ఆశించిన ఫలితాలు అందడం లేదన్నారు. ఒకవేళ ఈరోడ్డు పూర్తయితే ఎల్లారెడ్డి, పాపన్నపేటల మధ్య 25 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

◆ **రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన పెద్దశంకరంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట శివారులో ఎదురెదురుగా బైక్, ఎలక్ట్రికల్ బైక్ ఢీకొనడంతో వీటిపై ప్రయాణిస్తున్న పెద్దశంకరంపేటకు చెందిన విజయ్, పిట్లం మండలానికి చెందిన రమేశ్‌కు గాయాలయ్యాయి. వీరిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి హైవే అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

చేయూత



రేకుల షెడ్డును ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని వెల్పుగొండ గ్రామ అనాథ అయిన కొండ శివమ్మకు ఆశ్రయం కల్పించారు. ఆదివారం మండలంలోని ఎల్లుపేట గ్రామానికి చెందిన మామిడి సుధాకర్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా శివమ్మకు సుమారు రూ.1లక్ష కేటాయించి రేకుల షెడ్డును వేయించారు. దీంతో సుధాకర్ అన్న సైన్యం సభ్యులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో నాయకులు ముకుంద్‌రావు, నారాయణ, దాసు, మల్లేశం, రాజు, రామకృష్ణ, ముత్యం, దేవయ్య సుధాకర్, అన్న సైన్యం సభ్యులు ఉన్నారు.

ప్రసాదం పంపిణీ

తూప్రాన్: పట్టణంలో కొనసాగుతున్న బోనాల జాతర సందర్భంగా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ ప్రత్యేక కౌంటర్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు శ్రీనివాస్‌యాదవ్, రాజు, శంకర్, శ్రీనివాస్, దీపక్, నవీన్, నాగేష్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకోరా ?

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మద్దుల్‌వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి సరఫరా ట్యాంకు వద్ద మురుగునీరు, చెత్త చెదారంతో నిండిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆరోపించారు. కొన్ని రోజులుగా మంచినీటి ట్యాంకును పరిశుభ్రం చేయకపోవడంతో పాటు ట్యాంకు వద్ద పిచ్చిమొక్కలతో పాటు మురికికూపంగా మారినా.. ఎవరు పట్టించుకోకవడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ట్యాంకును క్లీనింగ్ చేసి ట్యాంకు పరిసరాలను పరిశుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన ట్యాంకు

శివ్వంపేటలో ఇరు వర్గాల ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్): బోనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చిప్పిన సంఘటనలో ఇరు వర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండల కేంద్రం శివ్వంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా బోనాల పండుగ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు చింపేశారని వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మా పార్టీకి చెందిన వ్యక్తులు ఫ్లెక్సీ చిప్పలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్ ఎదుట ఘర్షణ పడడంతో పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ సంఘటన పై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

ఇదేం రోడ్డు బాబోయ్..!

- అడుగడుగునా గుంతలు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

రేగోడ్(మెదక్): ఆ రోడ్డుగుండా ప్రయాణించాలంటే నరకంగా ఉంటుంది. అడుగడుగునా గుంతలతో ఇదేం రోడ్డురా బాబు అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను అరచేత్తో పట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని మండిపడుతున్నారు. ఇదీ మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలం.. పోచారం నుంచి రాయిపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి. మండలంలోని పోచారం నుంచి టి.లింగంపల్లి మీదుగా రాయిపల్లి వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర దూరం ఉంది. టి.లింగంపల్లి మీదుగా బోరంచ నల్లపోచమ్మ దేవాలయానికి కూడా భక్తులు వెళ్తుంటారు. ఈ దేవాలయం భక్తుల కొంగుబంగారంగా మారి ఎంతగానో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర తదితర పట్టణాల నుంచి భక్తులు నిత్యం వెళ్తుంటారు. ఇదే మార్గంలో ముంబై హైవే జహీరాబాద్, బీదర్‌కు సైతం వెళ్తారు. పోచారం నుంచి రాయిపల్లి వరకు ఎనిమిది కిలోమీటర్లు రోడ్డు గుంతలమయంగా మారింది. ఆదమరిచి ప్రయాణం చేస్తే ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ప్రజలు ఇంతలా ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



టి.లింగంపల్లి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



పోచారం నుంచి రాయిపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్తుంటే ఎక్కడ పడిపోతామోనని ఆందోళనగా ఉంది. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

– చంద్రయ్య, టి.లింగంపల్లి

గుంతలతో ప్రమాదాలు



అడుగడుగునా గుంతలతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రమాదం ఎక్కడ జరుగుతుందోనని భయంగా ఉంది. గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. నిధులు మంజూరు చేసి రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– సంగారెడ్డి, టి.లింగంపల్లి